ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం

సంతోష్‌నగర్: దక్షిణ మండలం పరిధిలో సంతోష్ నగర్ ఏసీపీ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం హోం మంత్రి మహమూద్ అలీ ప్రారంభించారు. ప్రస్తుతం సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ కూడా అక్కడే కొనసాగుతుంది. త్వరలో సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను రక్షాపురం అద్దె భవనంలోకి మార్చనున్నట్లు సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కుమార్ తెలిపారు. ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్‌కు బాధ్యతలు ఆయన వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, డీజీపీ అంజనీ కుమార్, సీపీ సి.వి.ఆనంద్, అడిషనల్ సీపీ విక్రం సింగ్ మాన్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, దక్షిణ, తూర్పు మండలం డీసీపీ రూపేశ్, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కుమార్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కిశోర్, ఎస్సైలు, రియాసత్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ సలీం బేగ్, సంతోష్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ ముజఫర్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు శ్యాంసుందర్, చింతల శ్రీనివాస్, పుష్పె శ్రీనివాస్, పెండ్యాల లక్ష్మణ్ పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో హోంమంత్రి మహమూద్ అలీ తదితరులు

క్లుప్తంగా...

నేడు పాతబస్తీలో జోనల్ కమిషనర్ పర్యటన

చార్మినార్: జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్‌తో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి పాతబస్తీలోని ఆలయాల వద్ద చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై పర్యటన నిర్వహించనున్నారని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, ప్రధాన కార్యదర్శి గాజుల రాహుల్ (గబ్బర్) తెలిపారు. ఉదయం 8 గంటలకు ఉప్పుగూడలోని శ్రీ మహంకాళి ఆలయం నుంచి జోనల్ కమిషనర్ పర్యటన ప్రారంభమవుతుందన్నారు. ఆయనతో పాటు ప్రభుత్వంలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు సైతం ఈ పర్యటనలో పాల్గొంటారన్నారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు సకాలంలో హాజరై అధికారులతో కలిసి ఈ పర్యటనలో పాల్గొని అవసరమైన సలహాలు, సూచనలు చేయాలన్నారు.

రాష్ట్రంలో చీకటి రాజ్యం



బండి సంజయ్‌తో బీజేపీ నాయకులు

గోల్కొండ: రాష్ట్రంలో చీకటి రాజ్యం నడుస్తుందని బీఆర్ఎస్ ప్రభుత్వ మంత్రులు, నాయకులు దొరల్లా విర్రవీగుతున్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. గుడిమల్కాపూర్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు గురువారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి పరాకాష్ఠకు చేరిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూడా రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన అన్నారు. ఆయనను కలిసిన వారిలో దేవర శ్రీనివాస్, సుధాకర్‌యాదవ్, నామ యాదగిరి, సందేశ్‌యాదవ్ తదితరులున్నారు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పీవీ సాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఇల్లెందుల ఉమాదేవి రచించిన వెన్నెల జలపాతం, అచ్చిక బుచ్చికలు పుస్తకాల ఆవిష్కరణ సభ గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఉన్న స్థితిగతులను ఎంతో అద్భుతంగా రచించారని, భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ ప్రభాకర్‌రావు, తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆచార్య వరిజ రాణి, సాహితీ వేత్త ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



జియాగూడ: అక్షదీప్ జూనియర్ కళాశాల విద్యార్థులు 92శాతం ఉత్తీర్ణతను సాధించారని జియాగూడ మెహిదీపట్నం అక్షదీప్ జూనియర్ కళాశాల డైరెక్టర్ మహ్మద్ అక్రమ్ అలీ అన్నారు. ఈ మేరకు జియాగూడ కేసరి హనుమాన్ వద్ద గల అక్షదీప్ జూనియర్ కళాశాలలో మొదటి, రెండో సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పూల బొకేను అందజేసి మిఠాయిలు తినిపించి అభినందించారు. అనంతరం డైరెక్టర్ మహ్మద్ అక్రమ్ అలీ మాట్లాడుతూ.. ఐదేళ్ల క్రితం జియాగూడలో అక్షదీప్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశామని, ఈ ఏడాదిలో విద్యార్థులు అధికశాతం ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందన్నారు. అకాడమిక్ డీన్ సుజాత, మెహిదీపట్నం ప్రిన్సిపాల్ విశాల్ సింగ్, జియాగూడ ప్రిన్సిపాల్ మహ్మద్ తవబ్, అకాడమిక్ ఇన్‌చార్జ్ అశ్విన్‌కుమార్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, సోమ్‌నాథ్‌యాదవ్ పాల్గొన్నారు.



గుడిమల్కాపూర్‌లోని నారాయణ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తాచాటారు. అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10/10, 9.8, 9.5 సాధించిన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హానా మొబిన్, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. అంబికానగర్ గాలి పోచమ్మ ఆలయం వద్ద గురువారం ఆమె సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో ఎలాంటి సమస్యలున్నా ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీహెచ్ఎంసీ ద్వారా మంజూరైన రూ.7.50 లక్షల నిధులతో ఈ సీసీ రోడ్డు పనులను చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు నిధులను కేటాయించకపోవడంతో డివిజన్‌లో పలు అభివృద్ధి, నిర్మాణ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్, బీజేపీ నాయకులు జమాల్‌పూర్ అశోక్, బీజేవైఎం నాయకులు కె.మనోజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శశికళ కృష్ణ

అబిడ్స్: ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయమని మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళకృష్ణ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన కర్తవ్యమే అన్నారు. మంగళ్‌హాట్ డివిజన్‌లోని దత్తాత్రేయ కమాన్ వద్ద రూ.5 లక్షలతో రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సహకారంతో డివిజన్ నలుమూలలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే రాజాసింగ్ ఆదేశాల మేరకు డివిజన్‌లో ప్రతిరోజూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరహరి, రవీందర్ సింగ్, కిశోర్, డ్యానియేల్, చిన్న రామకృష్ణ, స్థానిక నాయకులు మధు, గోపాల్, కునాల్, సేహల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

అబిడ్స్: వాటర్ బోర్డులో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని వాటర్ బోర్డు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు తమ అసోసియేషన్ అండగా ఉండి నిరంతరం వారి ప్రగతికి కృషి చేస్తుందన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోర్డు పరిధిలో ఉద్యోగుల సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు జి.షాలెం రాజు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రజినీకాంత్ రెడ్డి, సంఘం నాయకులు ఉదయ్‌కుమార్, సంతోష్, ప్రేమ్‌కుమార్, ప్రవీణ్, శేఖర్, జనార్దన్, వినయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో లక్ష్మీనారాయణ తదితరులు

బీజేపీ హయాంలోనే క్రీడలకు ప్రోత్సాహం

గోల్కొండ: కేంద్రంలోని బీజేపీ హయాంలోనే క్రీడా రంగంలో భారతదేశం అత్యుత్తన్నత స్థాయికి చేరిందని ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గురువారం గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియంలో ఖేలో భారత్–జీతో భాగ్యనగర్ క్రీడా పండుగ సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కబడ్డీ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాజీ జాతీయ స్థానిక క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్, బాక్సింగ్‌తో పాటు బ్యాడ్మింటన్, టెన్నిస్ వంటి వ్యక్తిగత క్రీడలతో పాటు టీం ఈవెంట్‌లతో భారత క్రీడాకారులు విశ్వవిజేతలుగా వెలుగుతున్నారు. ఈ కార్యక్రమంలో ఖేలో భారత్ కన్వీనర్ శంకర్‌యాదవ్, బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. అమర్‌సింగ్, డిజ్వర్ సింగ్, సునీల్‌యాదవ్ తదితరులున్నారు.



మాజీ క్రీడాకారులను సన్మానిస్తున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

దీనస్థితిలో చూసి.. మానవత్వం చాటి

అఫ్జల్‌గంజ్: మూడు నెలలుగా ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడిని ఆర్ఎంట డాక్టర్ ఎండీ రఫీ చేయూతనిస్తూ మానవత్వం చాటుకున్నారు. షోలాపూర్‌కు చెందిన ఖాజా బందా నవాజ్ మూడు నెలల క్రితం ఉస్మానియా ఆస్పత్రిలో చేరారు. వైద్య చికిత్సలు పూర్తయినా ఎవరూ లేకపోవడంతో ఇక్కడే దీనస్థితిలో కాలం వెల్లదీస్తున్నాడు. గురువారం ఆస్పత్రిలో డాక్టర్ ఎండీ రఫీ రౌండ్లు నిర్వహిస్తుండగా ఖాజా బందా నవాజ్‌ను గుర్తించి అతనితో మాట్లాడగా తనతో ఎవ్వరూ లేరని, తనది షోలాపూర్ ప్రాంతమని తెలిపాడు. చలించిన డాక్టర్ రఫీ వెంటనే హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సభ్యులను పిలిపించి వృద్ధుడికి పెరిగిన జుట్టు, గడ్డాన్ని కత్తిరించిన అనంతరం నూతన వస్త్రాలు అందించారు. తినడానికి సరిపడా ఆహారం, పండ్లు, కొంత డబ్బు ఇచ్చి ఎంజీబీఎస్‌లో షోలాపూర్ బస్సెక్కించి పంపించారు.



వృద్ధుడితో డాక్టర్ రఫీ తదితరులు

సబ్ స్టేషన్ ప్రారంభం

డబీర్‌పురా: డబీర్‌పురా టీబీ ఆస్పత్రి పక్కన నూతనంగా రూ.13.85 కోట్లతో ఏర్పాటు చేసిన 33/11కేవీ సబ్ స్టేషన్ విద్యుత్ కేంద్రాన్ని గురువారం మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల ఈదురు, గాలులతో కురుస్తున్న వర్షాలకు సబ్‌స్టేషన్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యల కారణంగా నూతనంగా విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కేంద్రంతో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్మాన్‌ఘడ్ డీఈ హనుమంత్‌రెడ్డి, దక్షిణ మండలం విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ బ్రహ్మం, ఏడీఈ కైలాష్, మాస్టర్ ప్లాన్ ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాసా చారి, చంచల్‌గూడ ఏడీ పాండు నాయక్ పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

'పది' ఫలితాల్లో శ్రీ శ్లోకా ది స్కూల్ విద్యార్థుల ప్రతిభ



వైష్ణవి



రతన్ శ్రీఖ

జియాగూడ: పదవ తరగతి ఫలితాల్లో జియాగూడ శాంతినగర్ శ్రీ శ్లోకా ది స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు 10/10 గ్రేడ్ సాధించారు. విద్యార్థినీలు సిలివెరి వైష్ణవి, రతన్ శ్రీఖ 10/10 గ్రేడ్ సాధించారు. ప్రతి యేటా శ్లోకా ది స్కూల్ విద్యార్థులు సత్తా చాటుతున్నారని ప్రిన్సిపాల్ ఎం.నాగేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా టాపర్స్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు రతన్ ప్రకాష్ జైస్వాల్, తిరుమల్‌రావు, బి.అన్వేష్, వైస్ ప్రిన్సిపాళ్లు అమితా చరణ్, జయ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బాసటగా బీఆర్ఎస్ ప్రభుత్వం

గోల్కొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు బాసటగా నిలుస్తుందని బీఆర్ఎస్ గ్రేటర్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లోని సూర్యనగర్ కాలనీలో షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాదీముబారక్, కల్యాణ లక్ష్మి పథకాల ద్వారా నిరుపేదల ఆడపిల్లల వివాహాలు ఆటంకాలు లేకుండా జరుగుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు ఓవైపు అమలుపరుస్తూనే సీఎం కేసీఆర్ యువతకు ఉపాధి కల్పించడానికి ఎన్నో పథకాలు చేపట్టడమే కాకుండా రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల నిధులు తెచ్చారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షులు దుర్గం ప్రదీప్, బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకులతో పాటు కాలనీనాయకులు ఆసిఫ్ హుస్సేన్ సోహెల్ తదితరులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



సుశీల (ఫైల్)

అఫ్జల్‌గంజ్: రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకువచ్చిన ఆటో ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గోల్కొండ షేక్‌పేట్‌కు చెందిన సుశీల (52) డెక్కన్ పార్కులో లేబర్ పని చేస్తుంది. గురువారం పని నిమిత్తం వెళ్లిన ఆమె పుత్లీబౌలీ వద్ద రోడ్డు దాటుతుండగా అతి వేగంగా దూసుకువచ్చిన ఆటో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏజీవర్సిటీ కంట్రోలర్‌గా శివాజీ

ఏజీవర్సిటీ: ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కంట్రోలర్‌గా డి శివాజీ నియమితులయ్యారు. ఆ పదవిలో ఉన్న రమేష్‌కుమార్‌ను వేరే శాఖకు బదిలీ చేశారు. ఈ మేరకు శివాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశ్వవిద్యాలయం ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు. రమేష్‌కుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు పలికారు.



తెలంగాణ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎండీ.షబ్బీర్ అహ్మద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాబర్ట్ బ్రూస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలిగామ అశోక్, ప్రధాన సలహాదారు అంతుల్ ఆజీమ్, ఈఎస్ఐ హాస్పిటల్ యూనిట్ అధ్యక్షుడు ఎండీ ఫారూఖ్, ఫీవర్ హాస్పిటల్ యూనిట్ అధ్యక్షురాలు లావణ, శ్రీకాంత్, పద్మజ, గోపికృష్ణ మరియు యూనియన్ సభ్యులు నివాళులర్పించారు.
– సుల్తాన్‌బజార్

గోషామహల్ అభివృద్ధికి కృషి

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్ బిలాల్ గురువారం మంత్రి తలసానిని కలిసి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. నియోజకవర్గం నలుమూలల ఉన్న సమస్యలను మంత్రికి వివరించారు బేగం బజార్ ఫీల్‌ఖానాలో మరుగుదొడ్ల నిర్మాణం గోషామహల్ చాక్నావాడిలో వేగంగా నాలా నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, ఇతర శాఖ అధికారులకు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. నందకిషోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండి వారి సంక్షేమానికి వారి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధికి కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతుందని అన్నారు.



మంత్రి తలసానిని కలిసిన నందకిషోర్ వ్యాస్ బిలాల్

పదవ తరగతి, ఇంటర్‌లో సత్తాచాటారు

అబిడ్స్: పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లో తెలంగాణ మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. నందనవనంలో ఉన్న జూబ్లీహిల్స్ బాలుర రెసిడెన్షియల్ విద్యా సంస్థ ఈ సంవత్సర ఫలితాల్లో పెద్ద ఎత్తున ఉత్తమ ఫలితాలను సాధించారని ప్రిన్సిపాల్ పైళ్ల ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కె.వాసు 942 మార్కులు, బైపీసీ విభాగంలో తరుణ్‌కు 947 మార్కులు, 10వ తరగతిలో మనోజ్‌సాయికి 9.3 జీపీఏ సాధించారని, వారికి తమ విద్యా సంస్థ అభినందనలు తెలిపిందన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ విభాగంలో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

షష్టిపూర్తి కలాలకు సత్కారం

నాంపల్లి: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో మాతృవందనం పేరుతో తెలుగు వర్సిటీ చిత్రవాణి విభాగం ఆధ్వర్యంలో షష్టిపూర్తి కలాలకు సత్కారం జరిగింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా ఆంధ్ర మహిళా సభ కాలేజ్ నర్సింగ్, స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్ పర్సన్ ఆచార్య ఎం.సులోచన, విశిష్ట అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరయ్యారు. 60 వసంతాలు పైబడిన 31 మంది రచయిత్రులను ఈ సందర్భంగా సత్కరించారు. చిత్రవాణి విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఐనంపూడి శ్రీ లక్ష్మి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉచిత విద్యా బోధన అందిస్తాం

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో అధిక మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు కావడమే తమ లక్ష్యమని గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్, నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తీర్ణులైన వారు ఫౌండేషన్ కార్యాలయానికి చేరుకుని గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపగా ఆయన వారికి మిఠాయిలు తినిపించి అభినందించారు. నియోజకవర్గంలో కొంత కాలంగా తాను మురికివాడలలో పర్యటించి నిరుపేద విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధనను అందించేందుకు వారి వివరాలను నమోదు చేసుకోవడం జరిగిందని వివరించారు. పదవ తరగతి పాసైన వారికి ఇంటర్మీడియట్, ఇంటర్మీడియట్ పాసైన వారికి డిగ్రీ, డిగ్రీలో పాసైన వారికి పీజీ కోర్సుల్లో ఉచితంగా విద్యా బోధన చేయించలేని కుటుంబాలు అండగా ఉండేందుకు, వారికి కౌన్సిలింగ్ నిర్వహించి ఉచిత విద్యా బోధన అందిస్తామని పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందని వివరించారు. 15 రోజుల లోపు తమను సంప్రదిస్తే వారికి ఉచిత విద్యా బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



విద్యార్థులకు మిఠాయిలను తినిపిస్తున్నట్లు గడ్డం శ్రీనివాస్ యాదవ్

ఏసీపీకి శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఫలక్‌నుమా ఏసీపీ షేక్ జహంగీర్‌కు ఉత్తమ సేవా పతకం దక్కడం హర్షణీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దినేష్ అంబారీ అన్నారు. ఫలక్‌నుమాలోని కార్యాలయంలో గురువారం ఏసీపీకి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పోలీస్ విభాగానికి అధునాతన వాహనాలు, భవనాలు నిర్మించి ముఖ్యమంత్రి పోలీస్ వ్యవస్థను బలోపేతం చేశారన్నారు.

కనీస సదుపాయాలు కల్పించండి

చాంద్రాయణగుట్ట: ఇంద్రానగర్‌లోని బేడ బుడగ జంగం కమ్యూనిటీ శ్మశాన వాటికలో కనీస సదుపాయాలు లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. శ్మశాన వాటికలో వెయిటింగ్ రూమ్స్, స్నానాల గదులు, రోడ్డు సైతం సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా వీధిదీపాలు సైతం లేకపోవడంతో రాత్రయ్యిందంటే అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని బేడ బుడగ జంగం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులకు విన్నవించారు. సదుపాయాల విషయమై ఇప్పటికే జీహెచ్ఎంసీ మేయర్, కమిషనర్‌లకు కూడా విన్నవించామన్నారు. ప్రహరీ లేకపోవడంతో రోజురోజుకూ కబ్జాకు గురవుతుందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న 'ఖేలో భారత్–జీతో భాగ్యనగర్'

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండో రోజు గురువారం ఖేలో భారత్–జీతో భాగ్యనగర్ వాలీబాల్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ వాలీబాల్ పోటీల్లో మొత్తం 26 టీమ్‌లు పాల్గొనగా.. ప్రస్తుతం రెండో రోజు పోటీలను జరుగుతున్నాయి. శుక్రవారం ఈ వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమం ఉంటుందని.. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, సంరెడ్డి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, సైదాబాద్ కార్పొరేటర్ అరుణ, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, నాయకులు మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కేరళ డాక్టర్ హత్యపై వైద్యుల నిరసన



సరోజినిదేవి కంటి ఆస్పత్రిలో నిరసనలో ...

గోల్కొండ: విధి నిర్వహణలో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడి చేయడం, చంపడం పాశవిక చర్య అని మెహిదీపట్నంలోని సరోజినిదేవి కంటి ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజలింగం అన్నారు. కేరళలోని కొల్లాంలో ఓ వ్యక్తిని పోలీసులు చికిత్స చేయడానికి వచ్చిన సందర్భంగా ఆ సమయంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యురాలు వందనాదాస్‌ను దుండగులు కొట్టి చంపడాన్ని నిరసిస్తూ గురువారం ఆస్పత్రి ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ వందనా దాస్ మృతికి 2 నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఇటువంటి ఘటనలు వైద్యుల మనోబలాన్ని దెబ్బతిస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి..

అఫ్జల్‌గంజ్: వైద్యులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని జూనియర్ వైద్యుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. కేరళలోని ఆస్పత్రిలో రోగికి వైద్య సేవలు అందజేస్తున్న వైద్యురాలి హత్యకు నిరసనగా తెలంగాణ రాష్ట్ర జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉస్మానియా ఆస్పత్రిలో జూనియర్ వైద్యులు కొంతసేపు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్లు కౌశిక్ కుమార్, ఆర్కే అఖిల్ కుమార్ మాట్లాడుతూ.. వైద్యులపై దాడులను తీవ్రంగా ఖండించారు. జూనియర్ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్లు పవన్ కల్యాణ్, వంశీ, రవి, దేవిక తదితరులు పాల్గొన్నారు.



ఉస్మానియాలో .. జూనియర్ వైద్యులు